# వాసెక్టమీ క్యాంప్

గవర్నమెంట్ హాస్పిటల్ కలకల్లాడుతోంది. కాంపుకి ప్రారంభోత్సవం చేసిన డి. ఎం. ఓ ని అప్పుడే సాగనంపారు. మీటింగుకి వచ్చిన ఆ వూరి ప్రసిడెంటూ, స్థానిక ఎం. ఎల్. ఎ కాంపు మెడికల్ ఆఫీసర్ వద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయారు. సభకు వచ్చిన వూరి పెద్దలంతా తమ దారిన తాము యిళ్ళ మొహం పట్టారు.

"వాసెక్టమీ" చేయించుకునే వారిని చుట్టుప్రక్కల పి. హెచ్. సి వానులోనూ, జీపుల్లోనూ హాస్పిటల్ కి చేరవేస్తున్నారు. చుట్టు ప్రక్కల వూర్లలో హెల్త్ విజిటర్స్ తమతమ వూర్లలోని వారి పేర్లను ముందుగా నమోదుచేయించి తమ వూరిలో ప్రాముఖ్యతను పెంచుకోవాలని ఎవరి మట్టుకు వారే తాపత్రాయ పడుతున్నారు.

అపరేషన్ థియేటర్లో డాక్టర్లు, నర్సులూ "ఇన్స్ట్రిమెంట్స్" (instruments) సర్దుకునే హడావుడిలో వున్నారు.

మరొకవైపు ఆపరేషన్ చేయించుకునే వారికివ్వవలసిన పాలూ, బ్రెడ్ ఏర్పాట్లు కొంతమంది చూస్తున్నారు.

ప్రొమోటర్ల ధాటికి తట్టుకుంటూ వచ్చిన వారి వూరూ పేరూ వ్రాసుకుని కేసులన్ని రిజిస్టర్ చేస్తున్న కృష్ణమూర్తికి తల ఎత్తడానికి కూడా తీరిక లేదు. ఒక్కొక్కరూ తమ తమ వూరూ, పేరూ చెప్పిముందుకు నడుస్తున్నారు.

"నీ పేరు"

"చెప్పనండి". తుపాకీ గుండులా వచ్చిన జవాబుకి అదిరి పడి తల ఎత్తి చూశాడు కృష్ణమూర్తి.

ఎదుట నలభై యేళ్ళ ప్రాయంలో మొరటుగా కన్పించాడా వ్యక్తి.

"నీ పేరేమిటి?" మళ్ళీ రెట్టించాడు కృష్ణమూర్తి.

"చెప్పనన్నా కదండీ. అయ్, మరంతే నండి" నిర్లక్ష్యంగా తల ఎగరేసి అన్నాడు. ఆ వ్యక్తి.

"ఇదెక్కడి గొడవయ్యా! పోనీ నిన్ను ఇక్కడకు తీసుకు వచ్చిన దెవరో చెప్పు"

"ఒకళ్ళు తీసుకు రావాలేంటండి. పిల్లల్లేకుండా ఆపరేషన్ చేస్తుందరని తెలిసొచ్చినా"

"ఏ వూరూ." సహనం కూడ గట్టుకుంటూ అడిగాడు కృష్ణమూర్తి.

"చెప్పనన్నా కదండీ!" విసుక్కున్నాడా వ్యక్తి.

"ఇదెక్కడి గొడవయ్యా! వూరూ, పేరూ చెప్పకపోతే ఎలా?" తల పట్టుకున్నాడు కృష్ణమూర్తి.

"అదేంటండి? వూరూ పేరూ చెబితే మా ఆవిడకు తెలిసిపోదూ! అలా కుదర్దులెండి"

డబ్బుకి ఆశపడి పిల్లలు లేకుండానే ఆపరేషన్ చేయించుకోవాలనుకుంటున్నాడా? ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు కృష్ణమూర్తి.

"ఎంతమంది పిల్లలు!" నిదానంగా చూస్తూ అడిగాడు కృష్ణమూర్తి.

"ఉన్నార్లెండి నలుగురు" నిర్లక్ష్యంగా అన్నాడా వ్యక్తి.

"మరింకేమయ్యా! ఆపరేషన్ మహరాజులా చేయించుకోక"

"మరందుకేకదయ్యా! నేనిక్కడకు వచ్చింది" చిరాగ్గా అన్నాడా వ్యక్తి.

"మరి ఊరూ, పేరూ చెప్పడానికేమయ్యా! మేం నోట్ చేసుకోవాలి చెప్పు"

"అబ్బే అలా కుదర్దులెండి. నేను ఆపరేషన్ చేయించుకున్నట్టు మా ఆడదానికి తెలియకూడదులెండి"

ఒక్క వ్యక్తి దగ్గరే క్యూ ఆగిపోయేసరికి మిగిలినవారిలో అసహనం బయలుదేరింది.

"ఏమిటి గొడవ?" కాంపు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హర్షవర్ధన్ టేబుల్ వద్దకు వచ్చాడు.

కుర్చీలోంచిచటుక్కున లేచి నిలుచుని పరిస్థితి వివరించాడు కృష్ణమూర్తి.

"చూడు బాబూ! మేం ఎవరెవరికి చేశామో రికార్డ్ చేసుకుని ప్రభుత్వానికి తెలియజేయాలి. అయినా ఊరూ పేరూ చెప్పకోవడంలో తప్పేమి వుంది?" మెల్లిగా నచ్చజెప్పబోయాడు హర్షవర్ధన్.

"అబ్బే! అలా వీల్లేదండి. నేను ఆపరేషన్ చేయించుకున్నట్లు తెలిస్తే తన జాగ్రత్తలో తానుండదటండీ మరి. ఈ ఈ దెబ్బతో మా ఆడదాని సంగతి తేలిపోవాలి" కళ్ళల్లో ఎర్రజీరలు ఏర్పడ్డాయి

పూర్తిగా అయోమయంలో పడ్డాడు డాక్టర్ హర్షవర్ధన్. 'ఊరూ పేరూ చెప్పకపోతే బైటకు పో!' అన్నమాట నాలుక చివరవరకూ వచ్చింది. కానీ తమాయించుకున్నాడు.

తమ జిల్లాకి రాష్ట్రంలో ప్రథమ స్థానం లభించాలనే పట్టుదలతో వున్నాడు తమ డి.ఎం.ఓ. తమ జిల్లాలో మిగిలిన కాంపులలోకంటే తన కాంపులో ఎక్కువ కేసులు జరగాలనే పట్టుదలతో పదిహేను రోజులుగా నిర్విరామంగా కృషి చేస్తున్నాడు తాను. ఈ పరిస్థితిలో ఏ ఒక్క కేసూ వదులుకోడానికి సిద్ధంగా లేడు తను. అందులోనూ ఆపరేషన్ కోసం వచ్చిన కేసుని వదులుకోవడమా? వూహూ!

"చూడు బాబూ! ఇదిక్కడి పద్ధతి. నీ వూరూ పేరూ చెప్పడంవల్ల ప్రమాదమేముంది? పైగా నీ అంతట నువ్వే చేయించుకుంటే, నిన్ను చూసైనా బుద్ధి తెచ్చుకుని వాళ్ళంతట వాళ్ళు వచ్చి ఆపరేషన్ చేయించుకుంటారు మిగిలిన వాళ్ళు కూడా" ఓపికగా నచ్చజెప్పబోయాడు హర్షవర్ధన్.

"కుదర్దండి. అలా కుదర్దన్నాను కదండీ! నేనాపరేషన్ చేయించుకున్నట్టు ఏ మాత్రం తెలిసినా మా ఆడది దాని జాగ్రత్తలో తానుంటుందండి. అలా కుదర్దండి. ఆపరేషన్ చేయించుకుని దాని బండారం బైటపెట్టాలండి"

"అంటే?" అయోమయంగా [illegible]

అబ్బూరి రాజకుమారి

గాడు డాక్టరు.

"అదంతే నండి. అయ్ మరంతే కదండీ!"

ఏదో మెరుపు మెరిసినట్లైంది హర్షవర్ధన్‌కి. అంటే...? తాను వాసెక్టమీ చేయించుకున్న తరువాత తన భార్య గర్భవతి అయితే, ఆవిడకు అక్రమ సంబంధం వున్నట్టు నిర్ధారణ చేసుకుంటాడన్న మాట.

మనసులోనే నవ్వుకున్నాడు డాక్టర్. తాను వాసెక్టమీ చేయించుకుని తన భార్యకు శీల పరీక్ష పెడుతున్నాడన్న మాట. బాగానే వుంది.

ఎక్కువ ఆలోచించడానికి సమయం లేదు. ఏదో విధంగా అతన్ని ఒప్పించి ఆపరేషన్ చేయడమే తన ధ్యేయం.

"నీ వివరాలేవీ బైటకు రావయ్యా! రెండో కంటి వాడికి తెలియనీయం. అందరి పేర్లూ నమోదు చేసుకున్న వెంటనే ఈ పుస్తకాన్ని హెడ్డాఫీసుకి పట్నం పంపించి వేస్తాం. ఇక మీ ఆవిడకి విషయం ఎలా తెలుస్తుంది?"

"అలాగాండీ! అయితే మా ఆవిడకీ విషయం తెలియదన్నమాటేగా! మరీ విషయం పెద్ద మనిషి ముందే చెప్పొచ్చుకదండీ! అనవసరంగా, ఇంతసేపిలా నిలబెట్టెయ్యడమేం మర్యాదండీ?"

కృష్ణమూర్తివైపు కోపంగా చూశాడా వ్యక్తి.

'బ్రతుకు జీవుడా!' అనుకుంటూ అతని వూరూ, పేరూ గబగబా వ్రాసుకున్నాడు కృష్ణమూర్తి.

క్యూ ముందుకు సాగిపోతోంది.

**ఆరు నెలల తరువాత—**

ప్రక్క వూరిలో సీరియస్‌గా వున్న తన స్నేహితుడ్ని చూసి తిరిగి వస్తున్నాడు డాక్టర్ హర్షవర్ధన్.

కారు వూరిలోకి రాకుండానే, వూరి మొదట్లో వున్న గుడిసెలలో ఏదో కలకలం.

కారునీ, కారులో వస్తున్న డాక్టరు గారినీ గుర్తుపట్టి కారు ఆపమన్నట్టుగా రోడ్డు కడ్డంపడి చేతులూపుతున్నారు కొంతమంది మనుష్యులు.

'ఎవరికో ప్రాణం మీదకు వచ్చినట్లుంది' అనుకుంటూ కారు ఆపాడు డాక్టర్.

"ఏమైంది?" విసుగ్గా చూశాడు.

"బాబూ! నారయ్య భార్యను పొడిచేశాడు. కొట్టుకుంటోంది బాబూ! అందులోనూ ఒట్టి మనిషికూడా కాదు. ఒక్కసారి తమరు చూస్తే....?" చేతులు నులుముకుంటున్నాడు ఒక వయసు మళ్ళిన వ్యక్తి.


"ఇక తప్పేదేముంది? కారు దిగి వారిని అనుసరించాడు. గుంపును దాటి లోపలికి వెళ్ళాడు రక్తపు మడుగులో పడి కొట్టుకుంటోంది ఒక నడివయసులోని స్త్రీ.

నాడి చూద్దామని చేతిని అందుకునే సరికి అంతిమ శ్వాస విడిచిందా అభాగ్యురాలు.

దుర్మార్గుడు. భార్యను నిలువునా ఖూనీ చేశాడు."

"పాపం ఒట్టి మనిషికూడా కాదట్గా!" ఎవరిదో సానుభూతి.

"ఆ! నాలుగో మాసంట. పిల్లల కోడిలా ఎప్పుడూ పిల్లలేనా అని వాడు సతాయిస్తాడేమోననే భయంతో వాడికి




తెలియనీయలేదు. చివరికీ రోజు తెలిసినట్టుంది. తెల్లవారిందగ్గరి నుండీ ఏదో గొడవ పడుతూనే వున్నారా మొగుడూ పెళ్ళాలిద్దరూ" ఎవరో వివరిస్తున్నారు.

"బాగుంది. పిల్లలు పుట్టుకు వస్తున్నారని భార్యను చంపుకుంటారా? కలికాలం" ఆడవాళ్ళు బుగ్గలు నొక్కుకున్నారు.

"అవునురా! మా ఆవిడను పొడిచిపారేశాను. పరాయి మగాణ్ని మరిగిన ఆడదాన్ని ఏలుకోడానికి మీలా సిగ్గూ, శరంలేని మనిషి కాన్రానేను. ఇన్నాళ్ళూ అదేదో వత్తిత్తు కబుర్లు చెబుతుంటే, నేనో అను మానపు వెధవనన్నారు కదరా, ఇప్పుడు చెప్పండి. నేను ఆపరేషన్ చేయించు కున్నాకా, ఇంత కాలానికి దానికి నెల తప్పడమేమి? వాడెవడో తెలిస్తే వాణ్ణి కూడా అడ్డంగా నరికి పారేస్తాను. అందుకే, అందుకేరా, నేను అపరేషను చేయించుకున్నట్లు మీ కెవరికీ తెలియనీయంది."

ఆవేశంలో అరుస్తున్న అతగాడ్ని చూస్తూ అలాగేనిలబడి పోయాడు హర్షవర్ధన్ ఆ వ్యక్తి-

"అయ్! మరధంతే నండి. నేను ఆపరేషన్ చేయించుకున్నట్టు మా ఆడదానికి తెలియకూడదండి. తెలిస్తే, దాని జాగ్రత్తలో అది వుండదండీ మరి?" ఈ దెబ్బతో దాని సంగతితేలిపోవాలండి. ఆ నాడు కాంపులో అతనన్న మాటలు చెవుల్లో గింగురు మన్నాయి.

తను వాసెక్టమీ చేయించుకున్న తరువాత భార్యకు నెల తప్పిందని తెలిసి హత్య చేశాడన్న మాట.

ఇక పోస్ట్ మార్టమ్, పోలీసు కేసు అంతా రొటీన్.

మెల్లిగా నిట్టూర్చి, తలవంచుకుని బైటకు వచ్చాడు తన కారు వద్దకు.

డ్రైవింగ్ సీటులో కూర్చుని "ఇగ్నిషన్‌కీ" తిప్పాడు.

గుండె కలుక్కుమంది.

"అవునూ! వాసెక్టమీ చేయించుకున్న తరువాత ఆరునెలల లోపు మళ్ళీ పిల్లలు పుట్టే అవకాశం వుందనీ, కాబట్టి ఆరు నెలలు జాగ్రత్తగా వుండాలనీ, ఆరోజునే ఆ వ్యక్తికి సూచనలిచ్చాడతను?"

భగవాన్! ఎవరిదినేరం?

ఎవరిదీ పాపం?